క్లుప్తంగా

గంగమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే



కాటసానికి స్వాగతం పలుకుతున్న కోనాపురం గ్రామస్తులు

అవుకు: మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో ఉన్న గంగమ్మను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన కొడితం కుటుంబ సభ్యులు గంగమ్మకు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పూజా కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో పలు విషయాలపై చర్చించారు. కొడితం మనోహర్, విక్రమ్, జగదీష్, వెంకటరమణ, రవికుమార్, క్రిష్టారెడ్డి, వెంకటరెడ్డి, పుష్పరాజు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఏప్రిల్ నెలకు సంబంధించిన పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోధనం బాలనాగన్న పాల్గొన్నారు.

బనగానపల్లెలో 94 శాతం పింఛన్ పంపిణీ

బనగానపల్లె రూరల్: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం తెలిపారు. మొత్తం 12,276 మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రం వరకు 11,417 మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కాగా ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా పలు గ్రామాల్లో ఒకే చోటకు రమ్మని అందజేశారు. కటికవానికుంట, ఫతేనగర్ గ్రామాల్లో సెల్ సిగ్నల్స్ సమస్యతో పింఛన్ పంపిణీలో జాప్యం జరిగి లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం డోన్ మండలంలోని ఉడుములపాడు గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ రాధమ్మ, ఎంపీడీఓ తదితరులు ఉన్నారు.

తండ్రీ కొడుకుపై దాడి





గాయపడిన బాబు, సుబహాని

కొలిమిగుండ్ల: వాహనం పార్కింగ్ విషయంలో వాగ్వాదం చోటుచేసుకోవడంతో తండ్రీ,కొడుకుపై మంగళవారం దాడి జరిగింది. సీఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. పెట్నికోటలో దూదేకుల సుబహాని ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసుకున్నాడు. అదే వీధిలో ఉంటున్న దూదేకుల నబీరసూల్ ట్రాక్టర్ వెళ్లేందుకు బైక్ అడ్డంగా ఉండడంతో వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో తండ్రీ,కుమారుడు బాబు, సుబహానిలపై నబీరసూల్ కుటుంబ సభ్యులు కట్టెలు, రాళ్లతో దాడికి దిగారు. ఇద్దరి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని అవుకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నబీరసూల్, చిన్న పుల్లయ్య, ఉసేని, బినాభి, పుల్లమ్మతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బుగ్గన శేషారెడ్డి పేరు తొలగింపు



బుగ్గన శేషారెడ్డి పేరుపై వేసిన తెలుపు రంగు

ప్యాపిలి: మండల కేంద్రంలో డోన్ మాజీ ఎమ్మెల్యే బుగ్గన శేషారెడ్డి పేరుతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బుగ్గన శేషారెడ్డి నైపుణ్య అభివృద్ధి కేంద్రం బోర్డులో బుగ్గన శేషారెడ్డి పేరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. పేరుపై తెలుపు రంగును పూశారు. డోన్ నియోజకవర్గానికి విశేష సేవలు అందించిన శేషారెడ్డి పేరుతో ఆయన మనుమడు, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అప్పట్లో నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నైపుణ్య అభివృద్ధి కేంద్రం మూత పడింది. కూటమి నేతలు అంతటితో ఆగక పేరును కూడా తొలగించి తమ అక్కసు వెళ్లగక్కారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి దుస్థితి



రైల్వేస్టేషన్‌లో ఒక్క ఫ్యాన్ లేని ప్లాట్‌ఫారం



నిరుపయోగంగా మారిన తాగునీటి కొళాయిలు

రైల్వేస్టేషన్‌లో కూత పెడుతున్న సమస్యలు

- ప్రయాణికులను వేధిస్తున్న వసతుల లేమి
- తాగునీరు కరువు
- సేద తీరేందుకు ఫ్యాన్లు లేవు
- మరుగుదొడ్లు లేక అవస్థలు



కోవెలకుంట్ల రైల్వే స్టేషన్



శిథిలావస్థకు చేరుకుని వినియోగంలో లేని మరుగుదొడ్లు

కోవెలకుంట్ల: నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలోని కోవెలకుంట్ల రైల్వే స్టేషన్‌లో సమస్యలు కూత పెడుతున్నాయి. ఉమ్మడి కర్నూలు– వైఎస్సార్ జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల వరకు 130 కి.మీ మేర రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. 2016లో ఆగస్టు నెల నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నంద్యాల నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు డెమో, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు, గుంటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఆయా జిల్లాల పారిశ్రామిక అభివృద్ధికి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్రతి రోజు ఈ మార్గంలో వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌ను మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. సీసీరోడ్డు వేసినా రోడ్డంతా దెబ్బతిని కంకర తేలి గుంతలమయంగా మారింది. రైల్వేస్టేషన్‌లో తాగునీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మంచినీటి పథకం పనిచేయకపోవడంతో కొళాయిల ద్వారా నీరు రావడం లేదు. బాత్‌రూం, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారాయి. రైళ్లు వచ్చే వరకు స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులకు ఫ్యాన్లు కూడా లేకపోవడంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాత్రి వేళలు, తెల్లవారుజామున కోవెలకుంట్ల స్టేషన్‌కు చేరుతున్నాయి. పట్టణానికి రెండు కి.మీ దూరంలో రైల్వేస్టేషన్ ఉంది. రైల్వేస్టేషన్ నుంచి ఇరువైపులా ప్రధాన రహదారులను చేరుకునే వరకు లైట్లు లేకపోవడంతో చీకటి వేళల్లో బిక్కుబిక్కుమంటూ ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిలిచిపోయిన ఉపాధి పనులు

- పనుల్లేక కూలీల అవస్థలు

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో రెండు రోజులుగా నిలిచిపోయాయి. ఆ పథక ఫీల్డ్ అసిస్టెంట్ నాగలక్ష్మి రాజకీయ కారణాలతో రాజీనామా చేశారు. ఆ స్థానంలో కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన సుమారు 1700 మంది ప్రతి రోజు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేని కారణంగా టెక్నికల్ అసిస్టెంట్ పర్యవేక్షణలో ఉపాధి పనులు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. వ్యవసాయ, ఉపాధి పనులు లేక ఇళ్ల వద్ద ఖాళీగా ఉండాల్సిన వస్తోందని కూలీలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని పనులు కల్పించాలని కోరుతున్నారు.

అప్కాస్ రద్దు సరికాదు

డోన్ టౌన్: అప్కాస్ రద్దు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని.. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప డిమాండ్ చేశారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద ధర్నా చేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

బనగానపల్లె: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట బుధవారం తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు మధుసూదన్‌రావు, మాధవస్వామి, సత్యప్రకాష్, శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేస్తున్నట్లు తెలిపారు.

కోలాహలంగా బండలాగుడు పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న రాతిదూలం పోటీలు



విజేతలతో ఆలయ కమిటీ సభ్యులు

సంజామల: కానాల సుంకులమ్మ పరమేశ్వరి తిరునాలను పురస్కరించుకుని గ్రామంలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్ల ఎద్దుల రాతిదూలం పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన పోటీల్లో వైఎస్సార్ జిల్లా దాసరపల్లికి చెందిన అశోక్ ఎద్దులు 6,070 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. రూ.30 వేలు గెలుచుకున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకట సాయి గణేష్ ఎద్దులు 6000 అడుగులు, సంజామల మండలం ముక్కమల్లకు చెందిన మూసాని చంద్రశేఖర్ రెడ్డి ఎద్దులు 5264 అడుగులు, దొర్నిపాడుకు చెందిన కృష్ణయాదవ్, దేవరాజు నాయుడు ఉమ్మడి జత 5253 అడుగులు, సంజామల మండలం కానాలకు చెందిన గుండం చెన్నరెడ్డి ఎద్దులు 5203 అడుగుల, బనగానపల్లె మండలం రామకృష్ణపురానికి చెందిన సర్పంచ్ నాగేంద్ర వృషభాలు 5100 అడుగులు, గోస్పాడుకు చెందిన ప్రమీల ప్రకాశం ఎద్దులు 4800 అడుగులు లాగాయి. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బండలాగుడు విజేత గద్వాల వృషభాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సుంకులమ్మ దేవస్థానం నిర్వాహకులు పాలపండ్ల వృషభాలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 5 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. నందికొట్కూరు ద్వితీయ, బేతంచెర్లకు చెందిన మేకల భానుజ వృషభాలు తృతీయ, అంబాపురం గ్రామానికి చెందిన కురువ వెంకట్రాముడు ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచాయి. ఆలయం తరఫున విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు అందజేశారు.



బేతంచెర్ల: పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందోత్సాహం



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన ‘పది’ పరీక్షలు

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మార్చి 17వ తేదీ ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 280, జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 234 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు సుందరయ్య, అరుణకుమారి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కోవెలకుంట్ల, ఇల్లూరు కొత్తపేట పాఠశాలల ఉపాధ్యాయులు మల్లికార్జున, పాండురంగారెడ్డి వ్యవహరించారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

ప్యాపిలి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ వెంకటేష్ నాయక్ తెలిపారు. మండలంలో ఐదు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

బేతంచెర్లలో 18 మంది గైర్హాజరు

బేతంచెర్ల: మండలంలో పదో తరగతి చివరి రోజు జరిగిన సోషల్ పరీక్షకు 18 మంది గైర్హాజరయ్యారు. బేతంచెర్ల, ఏపీ మోడల్ స్కూల్, సిమెంట్ నగర్, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల్లో మొత్తం 6 కేంద్రాల్లో 1099 మంది విద్యార్థులకు గాను 1081 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు తమ మిత్రులను ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంతోషంగా ఇళ్లకు వెళ్లారు.

విద్యార్థుల భావోద్వేగం

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. మండలంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చివరి రోజు పరీక్ష ముగిశాక విద్యార్థుల్లో భావోద్వేగానికి లోనయ్యారు. పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు విడిపోతుండడంతో జ్ఞాపకాలను పంచుకున్నారు. పాస్ అయ్యాక ఇంటర్ ఎక్కడ చేరుతావు.. ఏ గ్రూపు తీసుకుంటావని చర్చించుకోవడం కనిపించింది.

బనగానపల్లెలో 20 మంది గైర్హాజరు

బనగానపల్లె రూరల్: మండలంలోని తొమ్మిది కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు 1551 మంది హాజరుకావాల్సి ఉండగా 20 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానా



కిరాణ దుకాణంలో అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ

బనగానపల్లె రూరల్: పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లె కూరగాయల మార్కెట్‌తో పాటు పలు కిరాణ దుకాణాలను సందర్శించారు. ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని వ్యాపారులకు సూచించారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వీటి స్థానంలో డీగ్రేడ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

మూలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అవుకు: మండల పరిధిలోని మూలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అవుకుతోపాటు వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపాలిటీకి పెరిగిన ఆదాయం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



డోన్: ఈ ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ ఆదాయం రూ.6.88 లక్షలకు పెరిగిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని చిరు వ్యాపారులను వేధించకుండా ఉండేందుకు అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బందే వ్యాపారుల నుంచి సుంకం వసూలు చేశారన్నారు. అయితే సిబ్బంది కొరత కారణంగా ఈ ఏడాది మార్చిలో మూడుసార్లు వేలం పాట నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. దీంతో మార్చి 28వ తేదీ బాక్స్ టెండర్ ద్వారా వేలం నిర్వహించామన్నారు. ఇందులో రూ.19.10 లక్షలకు గురుస్వామి అనే వ్యక్తి కాంట్రాక్ట్ దక్కించుకున్నట్లు తెలిపారు. అతడికే ఈ ఏడాది సుంకం వసూలు కాంట్రాక్టు ఖాయం చేసినట్లు వెల్లడించారు. 2021–22లో సిబ్బంది వసూలు చేయగా రూ.8.40 లక్షలు, 2022–23లో రూ.13.99 లక్షలు, 2023–24లో రూ.12.22 లక్షలు సిబ్బంది ద్వారా వసూలు చేశామన్నారు. ఈ ఏడాది సిబ్బంది కొరతతో వసూలు చేయడం సాధ్యం కాకపోవడంతో టెండర్ బాక్సు విధానంలో కాంట్రాక్టర్‌ను ఖాయం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది గత ఏడాది కంటే రూ.6.88 లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందన్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొగటవీర క్షత్రియులు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నుంచి గోధుమ పిండి, నెయ్యి, బెల్లం పాకంతో తయారు చేసిన పదార్థంలో జ్యోతిని వెలిగించుకుని తలపై పెట్టుకుని భక్తి గీతాలు ఆలపిస్తూ గురువారం ఉదయానికి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడిచి వెళ్లనున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

జార్ఖండ్ మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బేతంచెర్ల అయ్యలచెర్వులో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం సాలీగూటు గ్రామానికి చెందిన హైబురు, భార్య చంద్రటియూ (35) నాలుగు నెలల క్రితం అయ్యలచెర్వుకు వచ్చారు. ఇక్కడున్న పాలీస్ ఫ్యాక్టరీలో హైబురు పనిచేస్తున్నాడు. పాలీస్ ఫ్యాక్టరీకి చెందిన ఓ గదిలో ఇద్దరూ నివాసం ఉంటున్నారు. మంగళవారం భర్త పనికి వెళ్లగా ఆమె ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి కొన ఊపిరితో ఉన్న ఆమెను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని.. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ సభ్యులకు సత్కారం



సత్కరిస్తున్న ఏపీ సీడ్స్ చైర్మన్

డోన్ టౌన్: ఇటీవల ఎన్నికైన డోన్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులును ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుసూదనగౌడ్, మహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్ యాదవ్, నాగరాజు, మదన్‌గోపాల్, కవీశ్వర్, చిన్న నాగిరెడ్డి పాల్గొన్నారు. అలాగే జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు, కొయికొండ కృష్ణ తదితరులు పూలమాలలతో సన్మానించారు.



హుసేనాపురంలో సుంకులమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో సుంకులాపరమేశ్వరి

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

బేతంచెర్ల: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు గ్రామ దేవతలకు మంగళవారం బోనాలు సమర్పించారు. బేతంచెర్ల, ఆర్‌ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, ముద్దవరం, మద్దికుంట, హుసేనాపురం, గూటుపల్లె గ్రామాల్లోని మారెమ్మ, సుంకులమ్మలకు మంగళవాయిద్యాల మధ్య మహిళలు సామూహికంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో బండలాగుడు పోటీలను నిర్వహించారు.



ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

ఘనంగా బీరప్పస్వామి తిరునాల



పుష్పాలంకరణలో బీరప్ప మల్లికార్జునస్వామి

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో బీరప్ప మల్లికార్జునస్వామి తిరునాల మంగళవారం ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ స్వామివారిని బావి వద్ద నుంచి కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్కభజనలు అలరించాయి. భక్తులు స్వామి వారికి ఉపవాస దీక్షలతో పుష్పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.